

# డాక్టర్ చెప్పిన కథలు

## - డా.శైలజ చందు



## – 20 –

ఒకో సారి ఈడ్చి చెంపమీద కొట్టాలనిపిస్తుంది.

ఎవర్నీ?

నన్నే. నేను చేసే ఒక్కో పనికి, నామీద నాకే చిరాకొస్తుంది.

ఏమైందంటే..

నా అసిస్టెంట్ పేరు ప్రగతి. ఆమె అందంగా ఉంటుంది.

కథలో అమ్మాయిలకు అందం అవసరమేనా?

ఏం? అందగత్తె కాకపోతే కథ చెప్పరా?

చెప్పనండీ, చెప్పను. నా కథ , నా ఇష్టం.

సరే మొదలెట్టండి! అందం వర్ణించడానికి, పూల రెక్కలు, రేకలు , మొగ్గలు, తొడిమెలూ అంటూ ఏమైనా సమాచారం తెమ్మంటారా?

సమాచారాలు, సహకారాలు అవసరం లేదు, వెటకారాలు మానండి. ప్రగతి అందగత్తె అయినందువల్లే ఈ కథ చెప్తున్నాను.

★★★★★★

ఆ రోజు సుదినం . ఎందుకంటే చాలా మంది పేషంట్ల తాలూకు జ్యోతిష్కులు మంచి రోజని చెప్పారు గనక, అది సుదినం. వాళ్ళ నక్షత్రబలానికి , నా అదృష్టం కూడా తోడవడం వలన ఆపరేషన్ టేబుల్ మీద పడుకునే సుసమయాలు మాత్రం వేరు వేరుగా కుదిరాయి.

ఆ రోజు చాలా ఆపరేషన్లు ఉన్నాయి. ప్రగతి వస్తే, ఏమేం కేసులున్నాయో చెప్పాలి. వాటికి అవసరమైన సూచనలివ్వాలి. మనసులోనే హడావుడి పడుతున్నాను.

ఉదయం పూట బాల్కనీ లో నిల్చుని కిందకు చూస్తున్నా.

బ్లూ రంగు కారు కాంపౌండ్ లోపలికి వస్తోంది. ఆ కారు ప్రగతిది. ఎప్పుడూ చెట్టు నీడన పార్క్ చేస్తుంది. వాచ్ మాన్ వచ్చి షెడ్ లో పెట్టుకోమని చెప్తున్నాడు.

షెడ్ లో నా కారు లేదు. నాతోటి డాక్టర్ సంగీత వాళ్ళింట్లో జరిగే పెళ్ళి ఊరేగింపులో పాల్గొనడానికి వెళ్ళింది. మగపెళ్ళి వారి మర్యాదల కోసమని నా కారే వినియోగిస్తారట. అందుకు నా కారే ఎన్నికైనందుకు సంబరపడి ఇచ్చేశాను. అంతగా అవసరమొస్తే, ఆటోలో వెళ్ళొచ్చు. ఇటువంటి అవకాశాలు వదులుకోవడం తెలివితక్కువ కదా. నాకిటువంటి డాబుసరి వేషాలంటే మొదటి నుండీ భలే మక్కువ.

మిస్ ఇంటర్నేషనల్ గా మన తెలుగమ్మాయి ఎన్నికైతే ఎంత సంబరంగా ఉంటుంది. అలాగ!

ప్రగతి హాస్పిటల్ లోపలికి వస్తోంది. గులాబి రంగు చీర కట్టుకుంది. లోపలికి వచ్చిన తర్వాత హాస్పిటల్ డ్రెస్ లోకి మారింది. అది కూడా అందమే.

మనిషి నచ్చితే అందానికేం లోటు?

డాక్టర్ ఉద్యోగానికీ, ఆఫీసుద్యోగానికి తేడా తెలియని కొంతమందితో పని చేశాక, నాకు ప్రగతి పని చేసే పద్ధతి చాలా నచ్చేది. చివరి నిముషం లో వచ్చిన పేషంట్లని కూడా తొందరలేకుండా చూస్తుంది. వాళ్లకు చెయ్యాల్సిన పనులు హడావుడి లేకుండా చేస్తుంది. హాస్పిటల్ లో చేరడానికి వచ్చిన వాళ్ళు రూం లో నిశ్చింతగా సెటిల్ అయే వరకూ ఉండి వెళ్తుంది. నవ్వదు కానీ, సౌమ్యంగా ఉంటుంది. తన డ్యూటీ అయిపోయే వేళకు, చీకటి పడుతోంది, ఆలస్యం అవుతోందని నాకు కంగారు వస్తుందేమో గానీ, వెళ్ళిపోదామన్న తొందర ఆమెలో కనపడదు.

పేషంట్లని ఒప్పజెప్పగలిగే ధైర్యం. వారితో ఆమె చక్కగా ప్రవర్తిస్తుందన్న నమ్మకం వచ్చింది.

నెమ్మదిగా నచ్చచెప్తుంది. నాలో ఓర్పు నిల్వలు తక్కువ. అవి ఎక్కువగా ఉన్న వారి పట్ల అభిమానం, ఆశ్చర్యం సహజమేగా.

ఉదయం తను వచ్చిందంటే ఒక నిశ్చింత. ఆమెకో పని చెప్తే, ఇక దాన్ని గురించి మర్చిపోవచ్చనే నిశ్చింత. పేషంట్లతో చక్కగా మాట్లాడగలుతుందన్న నిశ్చింత.

ఇద్దరం కాఫీ తాగేవాళ్లం.

కాఫీ తాగుతూ ఆ రోజు పనుల గురించి మాట్లాడుకుంటాం. కిచెన్ లో నాగమణికి కాఫీ పంపమని చెప్పి కిందకెళ్ళిపోయాను.

పని అయ్యాక కూడా ఏవో కబుర్లు చెప్పేది. అవి మా ప్రొఫెషన్ కు సంబంధించినవో , లేకపోతే ఏమిటో కబుర్లు. వాటిలో పెద్ద నాకు ఆసక్తి కలిగించేవేమీ ఉండవు. కానీ ప్రగతి మాట తీరు వినడానికి బాగుంటుంది.

ఆ రోజు మొదటి ఆపరేషన్ జరిగిన అమ్మాయి తండ్రికి మా ఊర్లో పేరు, పలుకుబడి ఉన్నాయి. రెండో ఆపరేషన్ పిలుపు కోసం, నేను ఎదురు చూస్తుంటే, పిలవకుండానే వచ్చి నా ఎదురుగా కూర్చున్నాడాయన.

ఎంతో మంది ఎన్నో విధాల పిలిచినా, దర్శనభాగ్యమే కలగజేయని ఆయన, అనుకోకుండా నా ఆఫీసులో అడుగు పెట్టినందుకు ఆశ్చర్య పడ్డాడు. నా అదృష్టానికి ఆయనే అసూయ పడ్డాడు. కాఫీ తెప్పించాను.

వాళ్ళమ్మాయి సర్జరీ అయిపోయింది. పుట్టిన బిడ్డని ముద్దులాడే నిమిత్తం కుటుంబం అంతా రూం లోనే ఉంది. చాలా తీరికగా ఉంది ఆయనకు.

తెల్లని ఇస్త్రీ పంచె కట్టుకుని, కాలి మీద కాలేసుకుని ఎన్నో రంగాలలో స్థిర పడ్డ గొప్ప గొప్ప బంధువుల గురించి చెప్తున్నాడు.

ఎవరి గురించి విన్నా సరే, వారికి ఏదో ఒక పద్మ అవార్డ్ ఇప్పించుదామన్న పట్టుదల వచ్చేస్తోంది.

పెరుగుతున సిజేరియన్ ప్రసవాలు, వాటి పూర్వాపరాల గురించి మా ఇద్దరి మధ్యా చర్చ మొదలైంది.

ఒక డాక్టర్ గా నేను, బాధ్యత ఉన్న పెద్దమనిషి గా ఆయన , ఇంకా ఇద్దరు పనిలేని వ్యక్తులు తోడు కూర్చుంటే సరిపోతుంది. ఎవరైనా టీవీ చానల్ వాళ్ళు ఉదయాన్నే, అరుపులు, ఉరుములతో కూడిన లైవ్ ప్రోగ్రాం చేసుకోవచ్చు. ఎటూ ఎవరి ధోరణిలో వారు వాగుతూ సాగిపోగలం .

ఆయన దృష్టికి వచ్చిన మా బిల్డింగ్ వాస్తు దోషాలు నాదృష్టికి కూడా తీసుకువచ్చాడు. అంత సులువుగా అపాయింట్ మెంట్ దొరకని ఒకానొక వాస్తు శిల్పిని పంపిస్తానని , ఆయన సేవలు వాడుకొమ్మని సూచించాడు.

ఆపరేషన్ లిస్ట్ లోని మిగిలిన పేర్లు గుర్తొచ్చాయి.

మనసులోని తొందర, మాటల్లో తెలియకుండా జాగ్రత్త పడుతూ ,ఆయనేం చెప్పినా సరే, అదే పనిగా "అవునా, అవునా" అని అంటున్నాను, చాతుర్యం లేని టీవీ యాంకర్ లాగా.

ప్రగతి నన్నేదో అడగడానికి కేసు ఫైల్స్ చేత్తో పట్టుకుని రూం లోపలికి వచ్చింది .

ఆ అమ్మాయి వంక మాటలాపేసి చూశాడు. తను వెళ్ళగానే అడిగాడు.

"ఎవరీ పిల్ల. మన వాళ్ళేనా?"

"అదే, అదేనండీ, అదే " అన్నాను.

జవాబు చెప్పలేనపుడు, అబద్ధం చెప్పవలసినపుడు ఒకే పదాన్ని కొద్దిగా అటూ ఇటూ మార్చి ఒకటికి రెండు సార్లు అంటాను. వినేవారి నమ్మక సౌకర్యార్థం.

నా వంక విసుగ్గా చూశాడు.

డాక్టరమ్మ కాస్త దద్దమ్మలాగా ఉన్నదే అన్న అభిప్రాయం ఆయన చూపుల్లో అగుపించింది. వెంటనే రెండు చెమ్చాల మేధావి తరహా నవ్వు , మొహం మీద పులుముకుని ఆత్మవిశ్వాసాన్ని వెలిబుచ్చాను.

'ఇంతటి సోది మనిషిని జన్మలో చూడలేదే' అన్న అభిప్రాయం కలిగేలా, ఎదుటి వారితో సంభాషించగలను. ఆ నైపుణ్యం నాకుంది.

నా ధోరణి , ఆయనకు ఆసక్తి కరంగా అనిపించక, వాళ్ళమ్మాయి గురించి కొన్ని వివరాలని అడిగి వెళ్ళిపోయాడు.

రెండు సర్జరీ లు అయే సరికి ఎనెస్థీషియా డాక్టర్ గారికి వేరే పిలుపొచ్చింది.

'మీరు అవీ ఇవీ సర్దుకునే సరికి ఎటూ టైం పడుతుంది. కాబట్టి నేను వేరే కేసు చూసుకుని, ఆ తర్వాత పెళ్ళికి వెళ్ళి వస్తాను. అప్పటికి మీరు తయారయి ఉండండి' అని చెప్పి వెళ్ళారాయన .

అలాగేనన్నాము. ,నా కారు వెళ్ళిన పెళ్ళికి, నేను కూడా వెళ్ళాలని గుర్తొచ్చింది.

మిట్ట మధ్యాహ్నం పెళ్ళికి , గట్టి జరీ అంచున్న బచ్చలి పండు రంగు పట్టుచీర కట్టాను. చీరకు తగిన ఆభరణాలు కూడా అలంకరించాను. సాదా చీర కట్టుకెళ్తే, 'ఏమి, మేము మరీ అంత తీసిపోయామా? కనీసం సరైన చీరైనా కట్టుకురాలేదీవిడ ' అని పెళ్ళివారు నొచ్చుకునే అవకాశం ఉంది.

'మీ చాదస్తం గానీ ఇవన్నీ ఎవరు గమనిస్తారండీ' అనుకునే అదృష్టవంతులు, అభినందనీయులు.

నా కారు లేదు. పెళ్ళికి, నన్ను తనతో కలుపుకుపోతానని మాటిచ్చిన వాళ్ళకు ఫోన్ చేశాను.

తన మతిమరపుకు తనను తాను తిట్టు కుని , ఆ విషయమే మరచిపోయానని చెప్పింది నా స్నేహితురాలు. అప్పటికే భోజనాల దగ్గర బిరియాని క్యూలో నిల్చుని ఉందట. పనసకాయ బిరియాని ప్లేట్ లో పడేందుకు ఇంకా జస్ట్ పదిమంది దూరంలో ఉండగా, నేను ఫోన్ చేశాననీ తెలిపింది.

పరమపదసోపాన పటం లో , ఆఖరి పీటెక్కబోతున్న వారిని లాగి, మొదటి పాము పక్కన దగ్గర నిలబడమనడం పాపము కదా.

సరే, నా అంతట నేనే వెళదాము అనుకున్నాను.

ఆటోలో వెళ్ళొచ్చు గానీ, ఎలాగా? ఈ భారీ అవతారం తో బయటికి వెళ్తే, అమ్మవారు ఆటోలో ప్రయాణం చేస్తోందని , శూలం, కిరీటం తక్కువైందని దారిన పోయేవాళ్ళు ఫీలయితే ?

పూనకాలు అవీ తెచ్చేసుకుంటే?

ఎలాగా అని ఆలోచిస్తుంటే, "మేడం, నా కారు తీసుకెళ్ళండి." అంది ప్రగతి.

మధ్యాహ్నం పూట మా వూరి ట్రాఫిక్ లో పట్టుచీర కట్టుకుని, కారు నడుపుకెళ్లడమంటే, అదే చీరతో వేడి ఇసకలో స్విమ్మింగ్ చేయడం లాంటి ప్రయోగం. అదీగాక ప్రగతి కారు నా కలవాటు లేదు.

"పోనీ, పెళ్ళికి నువ్వూ రావచ్చు కదా ప్రగతీ. ఇద్దరం కలిసి వెళదాం." బతిమలాడుతూ అడిగాను.

సౌజన్య, బలరాం అని ఇంకా ఇద్దరు జూనియర్ డాక్టర్స్ ఉన్నారు. వాళ్ళకు చెప్పాల్సిన జాగ్రత్తలు చెప్పి మేమిద్దరం హాస్పిటల్ బయటికి వచ్చాము.

"మిమ్మల్ని పెళ్ళిదగ్గర డ్రాప్ చేసి బయట వెయిట్ చేస్తాను మేడం." అంది ప్రగతి వెళ్ళే దారిలో.

"బయటెందుకు? ఏం పర్లేదోయ్. నువ్వూ రావొచ్చు."

"ప్లీజ్ మేడం! పెళ్ళివారెవరో నాకు తెలియదు."

" నీ ఇష్టం"

ఎక్కడికి వెళ్ళాలి అని అడిగితే ఏ కల్యాణ మండపమో చెప్పాను.

ప్రగతి కారునడుపుతుంటే అడిగాను.

"ప్రగతీ, నీ పెళ్ళెప్పుడూ?"

"లేదు మేడం" అని, ఒక క్షణం తర్వాత "ఇప్పుడప్పుడే, లేదు" అంది.

గుండెలో, చెప్పలేని బాధలేవో కొన్నుంటాయి.

బయటి వారు అంటుకోగూడని నిక్షేపాలవి.

'నీ వెధవ ప్రశ్నల గునపాలతో, వాటిని తవ్వి తీయాలా?' అని మనసు కసిరింది.

తప్పయిందని ఒప్పుకున్నా .

మేము వెళ్లే సరికి పెళ్ళి మండపం బయట చాలా హడావుడిగా ఉంది. పెళ్ళి కి వచ్చిన వాళ్ళ కార్లు వరుసగా ఉన్నాయి. మామూలు ట్రాఫిక్ కూడా తోడై, బాగా రద్దీగా ఉంది.

ముందే ఏర్పాటు చేసిన డ్రైవర్లు, కార్లో వాళ్లని దించి, తాళాలు తీసుకుని పార్కింగ్ వైపు తీసుకెళ్ళిపోతున్నారు.

ప్రగతి కారు దిగకుండా, మండపం బయట ఉన్న వధూవరుల ఫొటోలు చూస్తూ ఉంది. మా కారు సరైన వేగంతో కదలడం లేదన్న అసహనం, వెనక ఉన్న కార్లు హారన్ల రూపం లో వ్యక్తం చేస్తున్నాయి.

వెనకున్నది మంత్రిగారి వాహనం కూడా అయే సరికి, సఫారీ సూట్లు ధరించిన కొందరు వ్యక్తులు వచ్చి, త్వర త్వరగా ప్రగతిని, నన్నూ దింపేసి, చేతిలో నంబరున్న టోకెన్ పెట్టారు. ప్రగతికి లోపలికి రావడం ఇష్టం లేదన్న విషయం తెలుస్తూనే ఉంది.

"సారీ ప్రగతీ. పర్లేదులే, రా." అని అని లోపలికి లాక్కెళ్ళాను. మంత్రిగారి విలువైన సమయాన్ని వృధా చెయ్యకూడదు కదా మనం.

సాదా గులాబి రంగు చీరెలో చక్కగా ఉంది ప్రగతి. ఆడంబరం లో అందం ఉండదని ఇద్దరం చెరో విధంగా నిరూపిస్తూ లోపలికి అడుగుపెట్టాము. లేటు గా వచ్చామనుకుంటా. రిసెప్షన్ దగ్గర గులాబీలు లేవు. వోణీలు వేసుకున్న టీనేజ్ పిల్లలూ లేరు.

చాలా మంది మాటలాపేసి నా వెనకే ఉన్న ప్రగతి ని చూస్తూ ఉన్నారు. చక్కటి అమ్మాయిని చూస్తే క్షణకాలం పాటు సభ్యత పక్కకెళ్ళిపోతుంది కదా. ఎవరెవరో తెలిసినవాళ్ళు, స్నేహితులు కనిపిస్తున్నారు. పెళ్ళిళ్లనేవి జరగకపోతే, స్నేహితుల్ని కలవడం పలకరించడం జరగదేమో కదా.

తెలిసినవాళ్లతో ఒక హలో , రెండుమాటలు మాట్లాడి , అక్షింతలు వేయడానికి స్టేజ్ మీద కెళ్లాను. అప్పటికి పెళ్ళి తాలూకు అన్ని కార్యక్రమాలన్నీ అయిపోయాయి. పెళ్ళికొడుకు పెళ్ళికూతురికి స్వీట్ తినిపిస్తున్నాడు. సినిమాల ప్రభావంవల్ల కాబోలు, ఎంతో కొంత చిలిపిగా వ్యవహరించకపోతే చుట్టుపక్కల వారేమనుకుంటారోనని, పురోహితుడు చెప్పని తంతులేవో స్వంతగా నిర్వహిస్తున్నాడు. చుట్టు పక్కలవాళ్ళంతా నవ్వులతో ఆశీర్వదిస్తున్నారు.

కిందకొచ్చి చూస్తే ప్రగతి కనిపించలేదు. ఆమె కోసం అటూ ఇటూ చూస్తుండగా, అతిథుల్ని డైనింగ్ హాల్ వరకూ లాకెళ్ళే టీం సభ్యులు , నన్ను మర్యాదగా భోజనాల గది వరకు తోసుకెళ్ళారు.

కురుక్షేత్రం లోపలికి అడుగుపెట్టాను. దొమ్మీలు, తన్నులాటలు, మొదటి రోజు సినిమా టికెట్ల కోసం క్యూలో నిలబడి తోటివారితో భౌతికంగా తలపడడం వంటి వ్యవహారాల్లో ఎంతో కొంత అనుభవం ఉంటే తప్ప అక్కడ ప్రవేశం అంత సులువు కాదు.

యుద్ధం బాగా జరుగుతోందని సంతృప్తిగా తల పంకించాను. అభిమన్యుడి కన్నా అనుభజ్ఞురాలిని. వెళ్ళడం , రావడం రెండూ తెలుసు.

భీబత్సమైన కొట్లాట కెళ్ళే బదులు, ఆకలిచావు నయం కదా!

ఇంతకూ ప్రగతి ఏదీ? ఎక్కడా కనపడదే?

అనుకుంటుండగా చేతిలో ఫోన్ మోగింది.

"మేడం, ఎనస్థీషియా డాక్టర్ వచ్చేశారట. బయట వెయిట్ చేస్తున్నాను." అంటోంది ప్రగతి.

బరువైన చీరతో పరుగులు తీస్తూ వెళ్ళేసరికి కారుతో రెడీగా ఉంది.

పట్టు చీర త్యజించి, థియేటర్ డ్రెస్ వేసుకుంటే, ఊపిరి తీసుకోవడంలో సుఖం ఏమిటో తెలిసి వచ్చింది. త్వర త్వరగా పని మొదలెట్టాము.

ఓ అరగంట తర్వాత, ఆపరేషన్ దాదాపు పూర్తి కావొస్తోంది. ఎనెస్థీషియా డాక్టర్ టైం చూసుకుంటున్నారు. ఆయన వేరే కేసు కోసం వెళ్ళాల్సి ఉందని తెలుసు.

“ఎంత టైముంది సార్?” అని అడిగాను.

“ఒక అరగంటలో అక్కడుండాలి మేడం.”

“ఇంకెంత పది నిముషాలే” అంటుండగా సౌజన్య పైకొచ్చింది.

“మేడం ఒక ఎమర్జెన్సీ కేసొచ్చింది” అంటూ.

ఎనస్థీషియా సార్ వంక చూశాను. ఆయన మొహం లో భయం కనిపించింది. మళ్ళీ మేమెక్కడ ఆపేస్తామోనన్న భయం.

“ నేనిది పూర్తి చేస్తాను కానీ, నువ్వెళ్ళి అదేమిటో చూసిరా” అని ప్రగతిని కిందకు పంపాను. తను గ్లవ్స్ తీసేసి కిందకు వెళ్ళింది.

పదిహేను నిముషాల్లో, పేషంట్ ఉన్న ట్రాలీతో సహా లోపలికి వచ్చింది. థియేటర్ లో ఉన్న రెండో టేబుల్ మీద పడుకోబెట్టమని స్టాఫ్ తో చెప్పి నాదగ్గరకొచ్చింది.

“ మేడం ఎక్టోపిక్! రప్చర్ అయింది. నేను మొదలెడతాను” అంది.

పేషంట్ కడుపులో నొప్పి తో ఏడుస్తోంది. పొట్ట నిండుగా తెలుస్తోంది. మొహమంతా పాలిపోయి ఉంది. లోపల రక్తం పోతోంది.

గర్భాశయం లో ఎదగవలసిన పిండం , పక్కనే ఉన్న సన్నని ట్యూబ్ పెరుగుతూ , అక్కడ ఇమడలేక పగిలిపోతే ఏర్పడిన పరిస్థితి. త్వరగా ఆపరేషన్ చేసి ఆ ట్యూబ్ ని తొలగించడం ద్వారా, పోతున్న రక్తాన్ని కంట్రోల్ చెయ్యాలి.

ప్రగతి పని తీరు తెలుసు. కన్సెంట్ తీసుకున్నావా అన్న ఒక్క మాటే అడిగాను.

“ఎస్ మేడం!”

కానివ్వు అన్నట్టు తలాడించాను.

ఆమెకు మత్తు ఇవ్వడం, ఆపరేషన్ మొదలు కావడం అంతా క్షణాల్లో అయినట్టే అనిపించింది. నేను నా పని పూర్తి చేసి ఆ టేబిల్ దగ్గరకు వెళ్ళాను.

అప్పటికే ట్యూబ్ లో ఉన్న గర్భం తొలిగిస్తూ ఉంది. కొంతమంది పని చేసే తీరుకే అభిమానులం అయిపోతాం. వేగం అన్నివేళలా ప్రమాద కరం కాదు. కొన్ని సార్లు ఎంతో అవసరం. కొందరిలో వేగం ఉంటుంది. స్థిరమైన వేగం. ఎంత చక్కగా చేస్తోందీ సర్జరీ. ముచ్చట పడ్డాను.

ఎంత తక్కువ టైం!

ఆ టైం లోనే డయాగ్నొసిస్ చెయ్యడం, వాళ్ల బంధువులతో మాట్లాడి అనుమతి తీసుకోవడం, సరైన నిర్ణయం తీసుకోవడం , ఇవన్నీ జూనియర్ గా ఉన్నపుడే చేయగలుగుతోంది అంటే ఎంత మంచి భవిష్యత్తు ఉందీ అమ్మాయికి.

పరిస్థితి కంట్రోల్ లోకొచ్చింది. పేషంట్ పల్స్ , బీపీ, స్థిరంగా ఉన్నాయి.

మేడం ఒక బ్లడ్ రెడీగా ఉందట. రెండోది కావాలా అని అడుగుతున్నారు బ్లడ్ బాంక్ వాళ్ళు అంటూ ఆ రక్తం పాకెట్ తీసుకుని సౌజన్య లోపలికి వచ్చింది. అనుకున్న టైం లోనే ఎనెస్థీషియా డాక్టర్ వెళ్లగలిగారు.

దాదాపు చీకటిపడుతోంది. నాగమణి సాయంత్రం రానని చెప్పింది. పైకొచ్చి అన్నం , త్వరగా అయిపోయే కూర వండాను.

ఇంకా సాయంత్రపు రౌండ్స్ కాలేదన్న విషయం గుర్తొచ్చి వెళ్తుంటే, ప్రగతి ఎదురయ్యింది. రౌండ్స్ పూర్తిచేశానని చెప్పి, కొన్ని కేసుల్లో అనుమానాలుంటే అడిగింది. రిలీఫ్ అన్న పదానికి డిక్షనరీ చూడకుండానే అర్థం తెలిసింది.

“ఇంత రాత్రి ఏం వెళతావు , ఉండిపో” అన్నాను ప్రగతి తో .

ప్లేట్స్ , అన్నం, కూరా, బాల్కనీ లోకి తెచ్చాను. చంద్రుడికి పెట్టకుండా మేమే భోజనం చేస్తున్నాము. మామూలుగా అయితే ప్రగతి ఏవో కబుర్లు చెప్తుంది కానీ ఆరోజు అలిసిపోయినట్టుంది. మౌనంగా ఉంది.

★★★★★★★

తర్వాతి రోజు త్వరగా మెలకువ వచ్చింది. ప్రగతి రూం లోకి చూస్తే తను అప్పటికే లేచినట్లుంది. బెడ్ నీట్ గా సర్ది ఉంది. బాల్కనీలోకి వచ్చి నిల్చున్నాను. చల్లనిగాలి వీస్తోంది. ఎదురుగా ఉన్న కాంపౌండ్ లోని పొదుగాటి చెట్లు ఊగుతున్నాయి. సూర్యుడు రాబోతుండగానే, ఆకాశంలో రంగురంగుల ముగ్గు కనిపించింది.

ఫోన్ మోగింది. సంగీత.

నిన్న పెళ్లి హడావుడిలో సరిగా మాట్లాడనందుకు చేస్తుండి ఉంటుంది. లేదా కారు తీసుకున్నందుకు థాంక్స్ చెప్పడానికేమో! మరీ ఇంత పొద్దున్నే చెప్పాలా?

'హలో, హలో' తర్వాత నన్నూ, నాకు నచ్చని నిన్నటి బచ్చలి పండు చీరని అదేపనిగా మెచ్చుకుంది.

జరిగిన పెళ్ళి విశేషాలను చెప్తోంది.

పెళ్ళికి ఎక్కడ షాపింగ్ చేశారో, ఎవరెవరు వెళ్ళారో, చెప్తోంది.

ఏదో విషయం చెప్పడానికే చేసినట్టుంది. అది కాకుండా అన్నీ మాట్లాడుతోంది. ఈ మధ్య నడుస్తున్న ట్రెండ్ ఇదే. ఫోన్ చేసిన వెంటనే, విషయం చెప్పేయడం అనాగరికత. పేజీ కథకు, వెయ్యి పడగల ఉపోద్ఘాతం!

చీరల ఖర్చుతో సమానంగా బ్లౌజుల ఖర్చుంటోందని, అభిప్రాయపడ్డాము.

ఒకటే కాలేజీ అయినా గానీ , మా వాడి కెమిస్ట్రీ సార్, వాళ్లబ్బాయి కెమిస్ట్రీ సార్ వేరే వేరే అని తేల్చాము. ఇలాంటివి ఇంకెన్ని తేల్చాలో? ఇప్పట్లో పాయింట్ కొచ్చేట్టు లేదు. 'తొందరగా చెప్పి చావు' అనగలిగేంత చనువూ లేదు. ఓర్పు అప్పు తీసుకుందామంటే చుట్టుపక్కల ఎవరూ లేరు.

"అవునూ, ఆ పిల్లని తీసుకొచ్చావేంటీ పెళ్ళికి?"

పిల్ల? అదొక తిట్టులా వినిపించింది.

"దానికసలు సిగ్గూ శరం ఉందా?"

ఆ భాషకు , ఆ ఎత్తుగడకూ ఉలిక్కి పడ్డాను. ప్రగతి గురించేనా ఆ మాట?

"సంగీతా, ఎవరి గురించి మాట్లాడుతున్నావు? ప్రగతి తెలుసా నీకు?"

"అవును. ఆ టక్కులాడే! ఏ మొహం పెట్టుకుని పెళ్ళికొచ్చింది? "

గుండె చాలా వేగంగా కొట్టుకుంది. నీరసంగా అనిపించి, కుర్చీలో కూర్చున్నాను.

"తను నా బలవంతం మీద వచ్చింది. ఏమైందో చెప్పు."

"అదెంత కారెక్టర్ లేని మనిషో తెలుసా?"

'కేరెక్టర్...శీలము అంటూ' ఎంతో మంది అరుస్తుంటే విన్నాక, ఆ మాటకు నిజంగా అర్థం ఏమిటో కావట్లేదు.

" కాలేజిలో మా మేనల్లుడు, ఇదీ, ఒకే క్లాసు. వాణ్ణి వల్లో వేసుకుని రెండేళ్ళు తిప్పుకుంది. అంతకు ముందెవడో ఉన్నాడని అందరూ అంటారు. మా వాడితో రెండుమూడు సార్లు కనిపించేసరికి మా అన్నయ్య వాళ్ళు చడా మడా తిట్టారు దీన్ని. దానంతస్థెక్కడా? మా అంతస్థెక్కడా? ఆకాశానికిని నిచ్చెన వేసింది అమ్మడు. జారి బొక్కబోర్లా పడింది. వీడికో మంచి సంబంధం చూసి పెళ్ళి చేశారు. చూశావుగా పెళ్ళికూతురుని. ఆ పిల్ల కాలి గోటికి పోలదు ఇది. సిగ్గులేకుండా నిన్న చివరి నిముషంలో పీటలమీద పెళ్ళి ఆపుజెయ్యాలని వచ్చిందనుకుంటా."

టీవీ ప్రభావితమైన భాష వినిపిస్తోంది.

మాటల పదునుకు మనసు నొచ్చుకుపోతోంది. మనసంతా విచారం కమ్ముకుంది.

"సంగీతా, ఆ అమ్మాయి కావాలని రాలేదు. తనకేమీ తెలియదు. పొరపాటు నాది."

" దాని సంగతి తెలియక, వెనకేసుకుని వస్తున్నావు. కొంపలు కూల్చే రకాలు. గుండెలు తీసిన బంటు. మా అన్న పక్కకి లాక్కెళ్ళి చెడామడా తిట్టి, దయచేయి తల్లీ" అని బయటికి పంపించాడు. చెళ్ళుమని దెబ్బ తగిలినట్టనిపించింది. అంత అవమానం జరిగిందా?

"దాని ఆశ చూడు. చివరి నిముషంలో ఏదో చెయ్యాలనేగా వచ్చింది. కావాలంటే ఏం జరిగిందో అడిగి చూడు దాన్ని. అసలు దాన్ని అర్జంటుగా పనిలోంచి తీసెయ్యి. "

కొంత మందిని వివరాలడగడం కూడా అవమానించినట్టే. వారి వ్యక్తిత్వం మీద నమ్మకం లేనప్పుడే వివరాలడగాల్సి వస్తుంది.

"సంగీతా, ప్రగతిని అడగాల్సినదీ, తెలుసుకోవాల్సిందీ ఏమీ లేదు. అసలు నాకా హక్కు కూడా లేదు. నన్ను డ్రాప్ చెయ్యడానికి వచ్చింది."

"నువ్వడిగావే అనుకో, అమ్మడికి సిగ్గుండక్కర్లేదా?"

టీవీ చానల్స్ చలవ వల్ల, 'అమ్మడు' అనే పదం బూతుపదం అయిపోయింది.

"నామాట విని, నీతిమాలినదాన్ని పనిలోంచి తీసెయ్యి."

ఎదుటివారి జీవితంలో, ఏదైనా తప్పు జరిగిందో, అప్పటికప్పుడు మనలోని నైతికత ఎవరెస్టు లాగా పెరిగిపోతుంది. 'భారీ నీతిమంతులం' అన్న స్టాంపుతో మన మొహమ్మీద, మనమే బలంగా గుద్దుకుంటాం. లోపల దిగులుగా అనిపించి మౌనంగా ఉన్నాను.

"ఏమీ మాట్లాడవే?"

"ఆలోచిస్తున్నాను సంగీతా. తననెలా క్షమాపణ అడగాలా అని ఆలోచిస్తున్నాను. ఉంటాను మరి."

ఫోను పెట్టేసి ఆలోచిస్తున్నాను.

తను కోరుకున్న వ్యక్తి , తన కళ్ళముందే వేరే అమ్మాయిని పెళ్ళి చేసుకోవడం , ఆ పెళ్ళికి తను వెళ్ళవలిసి రావడం. అక్కడ అవమానం తట్టుకుని మళ్ళీ వెనక్కి వచ్చి వృత్తిలో తను ఎంత నిబ్బరంగా నిలబడిందీ. తలుచుకుంటే గుండె నిండి పోతోంది. బ్రేక్ అప్ కాగానే, బ్రేక్ డౌన్ అయి, చస్తామనీ, చంపుతామనీ బతుకంతా చిందర వందర చేసుకునేవారికి పాఠం లాంటి అమ్మాయి.

ఆమె మనసెంత బాధపెట్టాను.

ఎంతటి అవమానానికి కారణం అయ్యాను. ఎంత తప్పు చేశాను. ఛీ ఛీ..నన్ను నేను క్షమించుకోలేకపోయాను.

నాపై నాకు వల్లమాలిన కోపం వచ్చింది. వీలైతే ఈడ్చి చెంప మీద కొట్టాలనిపించేంత కోపం. అది కుదరక ఆ ఆగ్రహం కన్నీరులా మారింది.

ఏదో సుతిమెత్తని పూలపరిమళం చుట్టుముట్టడంతో పక్కకు తిరిగాను. ప్రగతి వస్తోంది . ఆ రోజు కేసుల ఫైల్స్ తీసుకొచ్చింది.

ఇద్దరం ఉన్నామని నాగమణి కాఫీలు తెచ్చి పెట్టింది.

తప్పు మనదేనని తెలిసినా సరే, క్షమాపణ చెప్పడం అంత సులువు కాదు. కాఫీ తాగుతూ తన చీర వంక చూస్తున్నాను, మొహం చూసే ధైర్యం లేక!

తెల్లని చీర మీద లేత రంగు పూలున్న చీర. అందంగా ఉంది.

ఆ అమ్మాయి మాత్రం అందగత్తె కాదా?

వ్యక్తిత్వం, స్థిరత్వం తో వచ్చిన అందాన్ని వర్ణించడానికి కలువలూ, గులాబి రేకలు, సంపెంగలూ , అవసరమా చెప్పండి.

COMMENTS